


## సౌదా

# జాబాల

గోధూళి వేళ హారిద్రుమత గౌతమ రుషి వర్ణాశ్రమ ధర్మాలను బోధిస్తూ వుండగా యెక్కడినుంచో ఒక బాలకుడు వొచ్చాడు.

"సత్యకామినై వొచ్చాను, గ్నానభిక్ష పెట్టు, గురూ!" అని ఆ చిన్నవాడు గౌతమ రుషి ముందు నిలబడ్డాడు.

"సత్యకామా! నువ్వెవరివి?" అని అడిగాడు గౌతమ రుషి.

"అది తెలుసుకోవడానికే వొచ్చాను. పేరు లేని నన్ను సత్యకామా అని పిలిచారు మీరు. ధన్యుడిని!" అన్నాడు ఆ వొచ్చిన సత్యకామి.

దాచిన దీపం వలె ధిషణాహంకారం వెలుగుతున్న ఆ బాలుడిని చూసీ చూడగానే యేదో లాగింది గౌతముడిని. వూరూ పేరూ లేనివాడికి గురుకుల ప్రవేశం లేదు. బ్రాహ్మణుల సమష్టాయిలో కూర్చునే అర్హత లేదు. ధర్మాలకన్నా ధర్మం వర్ణాశ్రమ ధర్మం. తాను గానీ, మహారాజుగానీ ఆ ధర్మాన్ని కాపాడ్డానికే ఉన్నారు.

యాచ్నా దైన్యం లేని యీ కుర్రవాడి కంఠస్వరం గొప్ప వర్ణాన్ని పలుకుతోంది. అయితే ఇతడి గోత్రమేమిటో తెలియకుండా సంభాషించడం తప్పు.

"నీ తల్లీ, తండ్రీ ఎవరు నాయనా ?" అని అడిగాడు గౌతమ రుషి.

"నా తల్లిపేరు జబాల. అంతే తెలుసు నాకు!" అన్నాడు సత్యకామి.

జ.బా.ల.

జ...బా...ల...

ఆ పేరు వినగానే విద్యుల్లత తగిలినట్టు కమిలిపోయాడు గౌతముడు.

జ...బా...ల... ఎవరామె?

అంతా సంశయమే! యెన్నో క్రతువులకు ఆవల, యెన్నో రుతువులకు అవతల ఆమె యెవరు?

జ.బా.లా. యెక్కడున్నావ్?

లోనంతా దుక్ఖపరంపరాన్వితమే. మేనంతా భయభ్రాంతమే. జీవనది ఒడ్డున భైరవాలయంలోని భూమి సేవికా, జబాలా నన్ను శాపగ్రస్తుడిని చెయ్యడానికే నీ కొడుకును పంపించావ్!

హారిద్రుమత గౌతమ రుషి లోపల మొలకెత్తింది వొక చిగురు. అది పిత్రు వాత్సల్య

జ్వాల.

ఇతడు నీ కొడుకా? అని గౌతముడి లోపలి నుంచి ఆ జ్వాల రెపరెపలాడుతోంది.

కాదు... కాదు... నా తపోమహిమ తిరుగులేనిది. నేను జబాలకు మళ్లీ కన్యత్వాన్ని అనుగ్రహించాను. ఆమె సద్యోగర్భం దాల్చలేదు. ఇతడు నా కొడుకు కాదు.

కాదు ... కాదు ... అవి తన మూర్తిని స్ఫురింపజేసే పోలికలే. ఇతడు నా కొడుకే! కానీ, లోకానికి తానేమని వెల్లడి చేయగలడు?

కడజాతి కన్యతో తన సంబంధం వర్ణాశ్రమ ధర్మవిరుద్ధం. దీన్ని దైవసంబంధ కార్యంగా సమర్థించే సూచన క్రియలు కూడా జరగలేదు. జబాల తిరిగి కన్యత్వమూ పొందలేదు. ఇక తనకు ఎటువంటి తపోమహిమా లేదని లోకులు నోరుబెట్టుకుని అరుస్తారు. తనది సామాన్యుల కామం అని హీన పరుస్తారు. తానొక సామాన్యుడు. మహత్వం చెయ్యలేని పనిని ధూర్తగుణం చేస్తుంది. దానికే ఒడిగట్టదలిచాడు గౌతమ రుషి. కిమ్మనకుండా ఆ కొత్తవాడిని గురుకులంలో చేర్చుకున్నాడు అప్పటికి.

దానితో ఆశ్రమంలో గుసగుసలు మొదలై రవరవలు రేగాయి. వూరూ పేరూ లేని ఒక కొత్తవాణ్ణి, కులమూ, గోత్రమూ అడగకుండా గురుకులంలో చేర్చుకోవడంతో దిమ్మెరపోయారు శిష్యులు. ఇది వర్ణాశ్రమ ధర్మమా అని గురువును ప్రశ్నించలేక సతమతమయ్యారు.

గురువుకు నిద్ర పట్టలేదు ఆ రాత్రి.

సత్యకామి పడుకున్న చోటుకు వెళ్లాడు ఆ అర్ధరాత్రి గౌతమ రుషి.

"సత్యకామీ!" అని పిలిచాడు.

"సిద్ధంగా ఉన్నాను, గురూ!" అన్నాడు సత్యకాముడు, దిగ్గున లేచి పద్మాసనం వేసి.

కానీ వచ్చిన గురువు బోధించడానికి రాలేదు. తెలుసుకోవడానికి వచ్చాడు.

"నీ కులమేది? గోత్రమేది?" అని అడిగాడు గౌతముడు.

"నే నెరుగను!" అన్నాడు సత్యకాముడు.

"నీ వుండిన తావేదీ?" అని అడిగాడు గౌతముడు.

"జీవనది ఒడ్డున భైరవాలయం. భూమి సేవిక నా తల్లి. అదే నా తావు!" అన్నాడు సత్యకాముడు.

ప్రతిదీ రూఢి అయిపోయింది గౌతముడికి. కలవరపాటు కనబడనీయకుండా ఇలా చెప్పాడు గౌతమ రుషి.

"నాయనా! నీ తల్లిని అడిగి నీ కులగోత్రాలను తెలుసుకుని రా! నదిని దాటడానికి ఇదే అనువైన వేళ. రాత్రిపూట జీవనది విశ్రమిస్తుంది. మోకాటి లోతున పవళించి ప్రవహిస్తుంది. ఇప్పుడే బయలుదేరు. రేపు రాత్రి ఇదే వేళకి జీవనది ఒడ్డున నీ రాకకోసం ఎదురు చూస్తూ ఉంటాను!" అన్నాడు.

బయలుదేరాడు బాలుడు అంత రాత్రివేళ.

నిద్ర చచ్చింది గౌతముడికి. తానే అతడి తండ్రినని జబాల చెప్పినట్టయితే ఏం చెయ్యాలి? మహర్షులదీ, మహారాజులదీ ఒకటే కర్తవ్యం. అదే వర్ణాశ్రమ ధర్మపాలన. ఇప్పుడు తానేం కానున్నాడు? రేపు రాత్రి జీవనది ఒడ్డున తానేం తెలుసుకోబోతున్నాడు? తెల్లవారుజామునెప్పుడో అతడి కనురెప్పల మీదకి వాలింది నిద్ర.

కానీ ఆ మరుసటి దినం పట్టపగటి పూటే తిరిగివచ్చిన సత్యకాముడిని చూసి కొయ్యబారిపోయాడు గౌతముడు. శిష్యులకు వర్ణధర్మాన్ని బోధిస్తున్న అతడి నోరు పడిపోయింది.

'ఈ పిడుగు అయోగ్యుల ముందు సత్యాన్ని పారబోయడు కదా!'

"గురూ! తెలుసుకుని వచ్చాను!" అని శిష్యులందరి ముందూ నోరు విప్పాడు సత్యకాముడు.

స్తంభించిపోయాడు గౌతముడు ఏం వినాల్సి వస్తుందో అని.

"గురూ! జీవనది రాత్రిపూట నిద్రపోదు. ఇప్పుడు కూడా అది మోకాటి లోతునే ప్రవహిస్తోంది. పగటికొక సత్యమూ, రాత్రికొక సత్యమూ ఉండదని మా అమ్మ చెప్పింది. సత్యాన్వేషకులు యముడితోనూ, మన్మధుడితోనూ తప్ప ఇంకెవ్వరితోనూ ఏకాంత సంభాషణ చెయ్యరాదని మా అమ్మ చెప్పింది..

"వయస్సున నేను అనేక పురుషులతో చరించాను. బహ్వాహం చరంతీ! నీవు జన్మించావు' అని మా అమ్మ చెప్పింది. గురూ! మా అమ్మకు భర్త లేడు. కనుక నాకు తండ్రి లేడు. పేరు లేని నాకు పేరుపెట్టిన గురువు, నాది ఏ కులం అంటే అదే నా కులం! అదే నా గోత్రం! మా అమ్మ చెప్పిందిదే!" అన్నాడు సత్యకాముడు.

ఆ అబద్ధంలో చుట్టుకుని ఉన్న నిజం గౌతమ రుషిని కోసేసింది. ఎవరికి చెప్పుకుంటాడు? ఎవరితోనూ పంచుకోలేని బాధ అది! సత్యాన్వేషి గౌతముడా, జబాలా? జబాల ప్రకృతి. గౌతముడు ప్రకృతిని జయించాలనుకున్నాడు. జయించడంలో సత్యం లేదని, ప్రకృతిలోనే తానున్నానని గౌతముడికి ఎన్ని తపస్సులు చేస్తే అర్థం అవుతుంది? సృష్టిలో సృష్టిగా ఉన్న జబాలకి తప్ప.

సృష్టితో తాదాత్మ్యం చెందే రహస్యాన్ని సత్యకాముడికి చెప్పింది జబాల. ప్రకృతి కన్నా తాను ఎక్కువ అనే శ్రేష్ఠమాన అహంకారం, ప్రకృతికన్నా తాను తక్కువ అనే హీనమాన అహంకారం, ప్రకృతితో తాను సమానం అనే సామ్యమాన అహంకారం ఈ మూడు అహంకారాలూ తెలియకుండా అయిపోవాలి మనిషి. ఇదే ఆ రహస్యం! దీన్ని గౌతముడికి చెప్పడం జబాల ఉద్దేశ్యం అయి ఉండవచ్చు.

కానీ సత్యకాముడు చెప్పలేదు. బహుశా వాడికి బొత్తిగా అర్థం కాకపోయి ఉండవచ్చు. లేదా, సంపూర్ణంగా అర్థం అయి ఉండవచ్చు. పసివాడు కదా, మర్మానికి మించిన నిజమూ, మర్మానికి మించిన అబద్ధమూ లేవు. మార్మికమైన లోకనీతి నుంచి జబాల విముక్తం అయిన విధం చూసి నిర్ఘాంతపోయాడు గౌతముడు.

"నాయనా! నువ్వు సత్యం చెప్పడానికి వెరవలేదు. అబ్రాహ్మణుడికి ఈ సత్యం శక్యం కాదు. నువ్వు సత్యసంధుడివి కనుక, బ్రాహ్మణుడివి. తల్లి నింత భక్తిగా కొలిచిన పుత్రు డిల లేడు. నువ్వు నీ తల్లి పేరుతోనే సత్యకామ జాబాలివై వర్థిల్లుదువు గాక! సమిధలు తీసుకుని రా, నీకు ఉపనయనం చేస్తాను!" అన్నాడు గౌతముడు. ■

## మహిళలకు ఉచితం



రుద్ర: 1968లో స్థాపితమైన ఆధ్యాత్మిక సేవాసంస్థ ఇంద్ర విరచితమైన 'మహాలక్ష్మ్యష్టక స్తోత్రమ్'....51,000 ప్రతులు ముద్రించి మహిళలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నది. ఈ స్తోత్రం పఠిస్తే ధన ధాన్య గృహ కనక వస్త్ర వాహన సౌభాగ్యం కలుగుతుందని 'పద్మ పురాణం'లో చెప్పబడింది. ఈ స్తోత్రప్రతిని ఉచితంగా కావలసినవారు తిరుగు టపాబిళ్లలు అంటించిన కవరు జతచేస్తూ, సెక్రటరీ, రుద్ర(మహిళా భక్త సేవా విభాగ్), పోస్టు బాక్సు నెం.6900, చెన్నయ్600 040కు రాసి పొందవచ్చునని, ఇది విజయదశమి పండుగరోజువరకు మాత్రమేనని, ముందస్తుగా ఉచితప్రతికై జాబు రాయు మహిళలకు ముందు పంపించే ప్రాతిపదికపైనని రుద్ర తెలియజేస్తున్నది.